జగనన్న ఇళ్లు కాదు.. ఊళ్లనే నిర్మించారు

ఇళ్ల పట్టాల పంపిణీలో
ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



కమలాపురంలో మహిళలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



సీకేదిన్నెలో లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి

కమలాపురం : సొంతిల్లు లేని అక్కచెల్లెమ్మల కల నెరవేర్చడానికి సీఎం జగనన్న ఇళ్లు కాదు... ఊళ్లు నిర్మించారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక 3వ వార్డు సచివాలయం వద్ద తహసీల్దార్ సుబ్రమణ్యం అధ్యక్షతన మండలంలోని 8 లేఅవుట్లలో కేటాయించిన 603 మందికి రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన ఇళ్ల పట్టాలను ఆయన లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మహిళ ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే జగనన్న లక్ష్యం అన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్లు సైతం నిర్మించి ఇచ్చారన్నారు. విజయవాడ, వైజాగ్ లాంటి మహా నగరాల్లో సెంటు రూ.20–30 లక్షల విలువ జేసే స్థలాలను ఇచ్చిన ఘనత జగనన్నదేనన్నారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చారని, రూ.3.64 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు పేరు చెప్పగానే ఒక్క పథకం అయినా గుర్తుకు వస్తుందా? అని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేస్తే బాబుకు కళ్లు, కడుపు మంట అన్నారు. ఎన్టీఆర్ కుటుంబానికి మేలు జరిగినా బాబు ఓర్చుకోలేడన్నారు. అందుకే ఎన్టీఆర్ కొడుకులను నామారూపాల్లే కుండా చేశాడన్నారు. అభివృద్ధి చేస్తే ప్రశంసించాలే గాని, బురద జల్లడం పనిగా పెట్టుకున్న బాబుకు త్వరలో జరిగే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆయన మహిళలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, ఆర్‌వీఎన్ఆర్, కరుణ్‌రెడ్డి, జగన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నిఖిల్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, రామసుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, దేవదానం, ఖాజా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం 498 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపేద మహిళలకు సొంతిల్లు ఉండాలని సంకల్పంతో ఇంటి స్థలాన్ని మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్ రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ఒక్క పైసా ఖర్చులేకుండా రిజిస్ట్రేషన్ పత్రాలు అందించడం అభినందనీయమన్నారు. మండలంలో 183 మంది లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ఆగ్రోకార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ అంజనాగౌరి పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. మంచి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మహిళలందరూ ఆదరించి ఆశీర్వదించాలన్నారు. అనంతరం 881 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ జి.ఎన్.భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.వి.ఎస్.ఆర్, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, అటవీశాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామమూర్తి, మండల ఉపాధ్యక్షుడు ఆర్.ఎస్.ఆర్, జేసీఎస్ కన్వీనర్లు ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసరాజు, మైనార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాల ప్రారంభం



పాఠశాలను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు యర్రగుడిపల్లెలో జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్‌ను శనివారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల చదువులు, పాఠశాల మౌలిక వసతుల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని వాటి స్థితిగతులను మార్చారన్నారు. రూ.2 కోట్ల నాడు–నేడు నిధులతో పాఠశాల నిర్మాణాలను అద్భుతంగా చేపట్టారన్నారు. విద్యార్థులు మీ భవిష్యత్తు కోసం జగన్ మామయ్య ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నాడని, ఆయన ఆశయాలకు అనుగుణంగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, ఆ వార్డు కౌన్సిలర్ బొగ్గిటి పురుషోత్తం, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ

లింగాల : బోనాల గ్రామంలో 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు లయోలా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అమల్ ఆరోక్యరాజ్ తెలిపారు. ప్రతిరోజు గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తూ పారిశుద్ధ్యం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. గ్రామంలోని చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద శనివారం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ గంగాదేవి, బోనాల ఎంపీటీసీ కళ్యాణి, నాయకులు నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల హుండీ లెక్కింపు

వేంపల్లె : స్థానిక వృషభాచలేశ్వరస్వామి అనుసంధానమైన ఆలయాల హుండీ లెక్కింపు శనివారం నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఈఓ విశ్వనాథరెడ్డి తెలిపారు. పర్యవేక్షణ అధికారి మారుతిప్రసాద్‌యాదవ్ సమక్షంలో లెక్కింపు నిర్వహించగా రూ.2.65లక్షల ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది 2023 మార్చి నుంచి ఇప్పటి వరకు ఈ ఆదాయం లభించిందన్నారు. పాపాఘ్నినది అవతల ఎద్దులకొండపై ఉన్న వృషభాచలేశ్వరస్వామి ఆలయం ఇప్పటికే ఆధునీకరణ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటేశ్, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు

పులివెందుల రూరల్ : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప ఎంపీ అభ్యర్థిగా ఇడుపులపాయలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించడంతో పులివెందులలో నూరుబాషా సంఘ కార్పొరేషన్ చైర్మన్ రసూల్ పట్టణంలో శనివారం బాణాసంచాలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రంగనాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు నర్సారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాపీరా, షమీవుల్లా, నాగరాజు, మల్లారెడ్డి, కుల్లాయప్ప, గంగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గంగమ్మ తిరునాల

లింగాల : మండలంలోని పెద్దకుడాల, చిన్నకుడాల గ్రామాల్లో వెలసిన గంగమ్మ దేవత ఆలయాల్లో ఆదివారం గంగమ్మ తిరునాల నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాది శివరాత్రి తర్వాత వచ్చే రెండవ ఆదివారం నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోందన్నారు. పెద్దకుడాలలో ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్రారెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు అందజేసి బోనాలు సమర్పించడంతో తిరుణాల ప్రారంభమవుతుందన్నారు. పులివెందుల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నామని డిపో మేనేజర్ తెలిపారు.

గెలిపించుకుందాం

ఎర్రగుంట్ల : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిలను మళ్లీ గెలిపించుకోవాల్సి బాధ్యత మనపై ఉందని ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ మూలె హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలను కోరారు. శనివారం సాయంత్రం వలసపల్లె గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వినియోగించుకోండి

పెండ్లిమర్రి : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్ఐ సునీల్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన మమ్ముసిద్దుపల్లె, పాతసంగటిపల్లె గ్రామాల్లో పోలీసులతో కవాతు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

సింహాద్రిపురం : మండలంలోని బిదినంచెర్ల గ్రామంలో నాలుగురోజుల నుంచి చెన్నకేశవ స్వామి దేవాలయంలో భాగవత పఠనం జరుగుతోంది. శనివారం జడ్పీటీసీ ఝాన్సీరాణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బ్రహ్మానందరెడ్డిల ఆధ్వర్యంలో మండలం, గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నివాళి

చెన్నూరు : స్థానిక వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి సతీమణి శనివారం మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆమెకు నివాళులు అర్పించి చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శించారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

తొండూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 15 రోజులుగా పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్యంపై గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు రక్తపరీక్షలు, వైద్యపరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ డెమో రమణమ్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్య ఆహారపదార్థాలు, మహిళల ఆరోగ్యం గురించి అవగాహన కల్పించామన్నారు. చట్టవ్యతిరేకంగా స్కానింగ్ సెంటర్‌లలో లింగ నిర్ధారణ చేయించుకోవడానికి ప్రోత్సహించరాదన్నారు.

కూలింగ్ వాటర్ మిషన్ వితరణ

పులివెందుల టౌన్ : పట్టణంలోని నగరవనం(రాణితోపు)కు మున్సిపల్ కౌన్సిలర్ కోడి రమణ రూ.20 వేలు విలువచేసే కూలింగ్ వాటర్ మిషన్‌ను శనివారం వైఎస్ మనోహర్‌రెడ్డి స్వగృహంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గోపాలకృష్ణకు వితరణగా అందజేశారు. మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రాణితోపులో సిబ్బందికి, వాకర్స్‌కు వేసవి తాపాన్ని తగ్గించేందుకు కౌన్సిలర్ కోడి రమణ తన దాతృత్వాన్ని చాటుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, నూరుబాషా సంఘ రాష్ట్ర చైర్మన్ రసూల్, జేసీఎస్ ఇన్‌చార్జిలు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గం.. రాజ మార్గం



లోక్ అదాలత్‌లో కక్షిదారులతో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ లావణ్య

కమలాపురం : కేసుల పరిష్కారంలో రాజీ మార్గం.. రాజ మార్గం అని, లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులు సత్వరం పరిష్కరించు కోవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లావణ్య తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇరువర్గాలు రాజీ ధోరణిలో ఉన్న 47 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందులో 33 క్రిమినల్, 9 సివిల్, 5 బ్యాంక్ కేసులు పరిష్కారం అయినట్లు వారు తెలిపారు. మెజిస్ట్రేట్ కక్షిదారులను చేతులు కలిపి రాజీ చేశారు. అనంతరం వారిని ఉద్దేశించి మెజిస్ట్రేట్ మాట్లాడుతూ రాజీ ధోరణిలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే తర్వాత అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉండదన్నారు. ముఖ్యంగా సమస్యలున్నవారు కక్షిదారులు కక్ష్యలు, కార్పణ్యాలకు వెళ్లకుండా గ్రామ పెద్దల ఎదుట పరిష్కరించు కోవచ్చన్నారు. లేని పక్షంలో పోలీసులు, కోర్టు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : స్థానిక కోర్టులో శనివారం జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి ఎస్.భార్గవి లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. చిన్న చిన్న సమస్యలకు పట్టుదలకు పోయి పోలీస్‌స్టేషన్‌లలో కేసులు పెట్టుకోకుండా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా 901 కేసులు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి పదవ తరగతి పరీక్షలు

లింగాల : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సెంటర్‌లో 233 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఎగ్జామ్‌నేషన్ చీఫ్ అంకన్న, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ నారాయణరెడ్డిలు తెలిపారు. ఈ సెంటర్ నందు 6 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పార్నపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు 65 మంది, కోమన్నూతల 20, పెద్దకుడాల 24, బోనాల 17, లింగాల 54, వెలిదండ్ల 53 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఇందులో బాలికలు 113 మంది, బాలురు 120 మంది రాయనున్నారన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలో పదవ తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఎంఈఓలు శ్రీనివాసరెడ్డి, శారదాలు తెలిపారు. మండలంలో రెండు సెంటర్లను ఏర్పాటు చేశామని జడ్పీహెచ్ఎస్ సెంటర్‌లో 104 మంది, కేజీబీవీ సెంటర్‌లో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



చీమలపెంటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో కులం, మతం, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి కోరారు. శనివారం సాయంత్రం చీమలపెంట గ్రామ పంచాయతీలోని చీమలపెంట, చీమలపెంట దళితవాడ, బారెడ్డిపల్లె, మిన్నయ్యగారిపల్లె, గుర్రాలచింతలపల్లె గ్రామాల్లో ఆమె ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించి మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఏనాడు పేద ప్రజల గురించి పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు.

రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, గౌరిశంకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరసింహరెడ్డి, బ్రహ్మంరెడ్డి, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలు కుటుంబాలు చేరిక



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని ఓబుల్‌రెడ్డిపల్లెలో తెలుగుదేశం పార్టీకి చెందిన శీను, గంగరాజు, రెడ్డెయ్య, శంకర్, గణపతి, ఓబులేసులుతోపాటు మరో 10 కుటుంబాలు శనివారం సర్పంచు విజయ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి వైఎస్సార్‌సీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మాజీ ఎంపీపీ వీరయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ మినీ సెక్రటేరియట్‌లోకి పాడా కార్యాలయం

పులివెందుల టౌన్ : పట్టణంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ మినీ సెక్రటేరియట్‌లోకి పాడా కార్యాలయాన్ని శనివారం తరలించి పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన ఛాంబర్‌లో సిబ్బందితో పలు విషయాలపై ఆయన చర్చించారు. ఇక నుంచి పాడా కార్యాలయం సేవలు వైఎస్సార్ మినీ సెక్రటేరియట్ నుంచి నిర్వహించనున్నామని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



తాడిగొట్లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి

చింతకొమ్మదిన్నె : ప్రతి ఒక్కరూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓటు వేయాలని సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని తాడిగొట్ల గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గుడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

గండి అంజన్న సన్నిధిలో ప్రముఖులు



గండి అంజన్నకు పూజలు చేస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజల ఆధ్వర్యంలో అర్చకులు వారికి ప్రత్యేక పూజలు చేయించారు. వారివెంట అన్నమయ్య జిల్లా జడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శనరెడ్డి పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రజలు సుభిక్షం

వేంపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎంపీటీసీ పద్మారెడ్డి రాజకుమార్ తెలిపారు. శనివారం స్థానిక గరుగువీధుల్లో మేము మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఈ ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 3వ సచివాలయం కన్వీనర్‌బాబా, గృహసారథులు తల్లం కిరణ్‌కుమార్, రామ్‌మోహన్‌రెడ్డి, అంజనమ్మ, కార్యకర్తలు, ఆర్చ్ చలపతి, పద్మా బాలసుబ్రమణ్యం, కాదర్‌వలి, దస్తగిరి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించుకుందాం

చక్రాయపేట : జగనన్నను, అవినాష్‌రెడ్డిని గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు మనకు వస్తాయని జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదరావు, మండల యూత్ కన్వీనర్ రామాంజనేయరెడ్డితో కలసి ఆయన కె.రాజుపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేతలు జనార్ధనరెడ్డి, బాలనాగిరెడ్డి, రమణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుష్ట శక్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

వీరపునాయునిపల్లె : వచ్చే ఎన్నికల్లో దుష్ట శక్తులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని నేలతిమ్మాయపల్లె, ఓబుల్‌రెడ్డిపల్లె, మద్దిపల్లె గ్రామాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని ఆయన కోరారు. తెలుగుదేశం పార్టీకి ఓటమి భయం పుట్టు కొందని అందుకే జనసేన, బీజేపీ పార్టీలతో పొత్తు లు పెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో పార్టీలన్నీ ఒకవైపు ఉంటే జగన్‌మోహన్‌రెడ్డి సింగల్‌గా పోరాటానికి సిద్ధమయ్యాడన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మండల పరిశీలకుడు రాజుపాలెం జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ విజయ్ కుమార్‌యాదవ్, ఎంపీటీసీ గంగాధర్, వైస్‌ప్రెసిడెంటు బాదుల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభం

చెన్నూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాలను శనివారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. మండల ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.4 కోట్ల 70 లక్షలతో ఈ భవనాలను నిర్మించామన్నారు. అ లాగే వైద్య సిబ్బంది కూడా సమయపాలన పా టించాలన్నారు. మెడికల్ అధికారి డాక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వారానికి రెండు సార్లు ట్యూబెక్టమీ(కుటుంబ నియంత్రణ) ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు. కడప రిమ్స్‌కు వెళ్లనవసరంలేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ హిమ, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైద్యులు పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తాం

కమలాపురం : అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజల సహకారంతో మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తామని రిటర్నింగ్ ఆఫీసర్ గణేష్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఎన్నికల నియమావళికి సంబంధించిన నిబంధనలు వెల్లడించారు. ముఖ్యంగా మోడల్ కోడ్‌కాండక్ట అమల్లోకి వచ్చిందన్నారు. 24 గంటల్లోపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, సీఎం, మంత్రుల ఫొటోలతో పాటు బయట ఉన్న ఫ్లెక్సీ తదితర వాటిని తొలగిస్తామన్నారు. 36 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో, 72 గంటల్లో అన్ని ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, ఫొటోలు, హోర్డింగ్స్ తొలగించాలని ఈసీ ఆదేశాలు ఉన్నాయన్నారు. అయితే తాము వాటిని సగం సమయంలోనే తొలగిస్తామన్నారు. పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు ఇళ్లలో ఏర్పాటు చేసుకునే వారు సైతం తమ అనుమతి తీసుకోవాలని, అందుకు అయిన ఖర్చును అభ్యర్థి అకౌంట్‌లో రాస్తామన్నారు. వెహికల్‌కు ఏర్పాటు చేసే జెండా ఖర్చు సైతం లెక్కిస్తామన్నారు. ఇందుకు ఫ్లైయింగ్ స్క్వాడ్ 24 గంటలు పర్యవేక్షిస్తుందన్నారు. సర్వేకల్ టీం కూడా 24 గంటలు అందుబాటులో ఉండి ఎన్నికల నియమావళిని పర్యవేక్షిస్తుందన్నారు. అలాగే సీకేదిన్నెలో జిల్లా చెక్ పోస్ట్ ఉంటుందని, అక్కడ అన్ని వాహనాలను నిశితంగా పరిశీస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలు వెచ్చించాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని, 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 26న స్క్రూటినీ, 29న ఉపసంహరణ మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. నియోజకవర్గంలో మొత్తం 27రూట్లలో 251 పోలింగ్ స్టేషన్లు ఉండగా అందులో 58 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. తమకు అన్ని రాజకీయ పార్టీలు సమానమేనని, రాగద్వేషాలు ఉండవని, అందరూ సహకరించాలని, అందరి సహకారంతో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తామని ఆయన వివరించారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పులివెందుల టౌన్ : పులివెందుల పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసిన పూర్వపు విద్యార్థులు శనివారం పాల్గొని వారి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కళాశాల ద్వారా తమ జీవితాలలో మంచి మార్పు వచ్చిందని కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ విజయ్ రాజు, మెకానిక్ హెచ్ఓడీ జీపీఎస్ సెబాస్టియన్, పూర్వపు విద్యార్థుల కన్వీనర్ ఫాదర్ బుజ్జిబాబు, మెకానికల్ అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతోనే ప్రత్యేక రాష్ట్రం



కమలాపురంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



పులివెందులలో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న, అసోసియేట్ డీన్ ఎంఎస్ భేగ్, తదితరులు

కమలాపురం : అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన ప్రాణ త్యాగంతోనే ప్రత్యేక సమైక్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిందని ఆర్యవైశ్య నాయకులు తెలిపారు. శనివారం స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో గ్రేట్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు 124వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించి పెట్టిన పొట్టిశ్రీరాములు అమరజీవిగా ప్రజలందరి మనసుల్లో నిలిచారన్నారు. పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహాన్ని రాజధానిలో ఏర్పాటు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు కామిశెట్టి వెంకటరమణయ్య, బచ్చు సుబ్రమణ్యం, గోపాలకృష్ణ, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుడు అమరజీవి పొట్టిశ్రీరాములు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. తెలుగురాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన పొట్టిశ్రీరాములు మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు చంద్రమౌళి, పార్నపల్లె కిశోర్, కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, రంగనాథస్వామి ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, కౌన్సిలర్ కోడిరమణ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో..

పట్టణంలోని ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ భేగ్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. సత్యసాయి సేవా సంస్థ నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఏఓ డా.రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.